

# హిమబిందు

- సుంకర వి. హనుమంతరావు

## (గత సంచిక తరువాయి)

**సుమనే పరిశీలనగా చూస్తున్న** విజయలక్ష్మిగారు "ఈ బంగారుబొమ్మ - నా కోడలైతేనా?" వూహల్లోకి వెళ్ళిపోయింది.

పజిలైపోయిన వరుణ్ పొలమారిపోతే గ్లాసుతో నీళ్ళు అందిస్తూ హిమ, "మిష్టర్ వరుణ్! సుమ మాటలు అస్సలు కేర్ చేయకండి. వసపిట్టలా వాగుతూ వుంటుంది ఎప్పుడూ" సర్దిచెప్పింది.

"కాదు హిమక్కా! మా అన్నయ్య అందరికీ ఎలా బావో తెలియకపోతే మాకెవ్వరికీ ఆకలుండదు. ఆత్మశాంతి అస్సలుండదు. ప్లీజ్ ప్లీజ్.. సుమసింధూ ప్లీజ్" అంటున్న రజనీని చూస్తూ.

"సారీ రజనీ! యిది కె.బి.సి ఫైనల్ క్వశ్చన్ అంటే ఐదుకోట్ల మహామనీ అన్నమాట చెపితే నాకేమిస్తావ్?" సీరియస్‌గా అడిగింది.

"ఏం కావాలో నువ్వే అడుగమ్మా" సపోర్ట్ చేసిది వరుణ్ తల్లి విజయలక్ష్మి.

"అన్నయ్యది 160 జి.బి 40,000 సాంగ్స్ ఆపిల్ ఐపోడ్ అది ఓకేనా?" రజని అడిగింది.

"ఐదు కోట్లకి - ఆపిల్ ఐపోడా?"

ఆలోచిస్తున్నట్లున్న సుమ పోజు సూటిగా గుచ్చుకుంది వరుణ్ గుండెల్లో. చుట్టూ చూశాడు. హమ్మయ్య ఎవరి గొడవల్లో వాళ్ళున్నారు. రిలాక్స్ అయ్యాడు వరుణ్.

"దాని మేజిక్‌లో అందరూ పడిపోయారు. ఐ పిటీయూ ఆల్" అంటున్న హిమను చూస్తూ బోసుబాబు వరుణ్‌లాగే ఫీలయిపోయాడు.

"అక్కా! అడ్డం పడకే ప్లీజ్" అంటున్న సుమను చూస్తూ

"ఓకే రజనీ - ఐ కన్‌ఫర్మ్ యువర్ ప్రామిస్" నోరిప్పాడు వరుణ్.

"అయితే సరే లాయర్‌జీ తమరే సాక్ష్యం" బోసుబాబుతో చెప్పింది.

"లాయర్ సాక్ష్యం కోర్టులో చెల్లదనుకుంటా!" అనురాధాదేవి అడ్డం పడిపోయింది.

"మా అన్నయ్య మాటంటే మాటే" రజని సపోర్ట్ చేసింది.

"సరే వరుణ్‌జీ మీ ఇంటిపేరులో మొదటి అక్షరం చెప్పండి."

"బా" - బదులిచ్చాడు వరుణ్.

"మీ పేరులోని మొదటి అక్షరం చెప్పండి."

"వ" చెప్పాడు.

"రెండూ కలపండి."

"బావ"

"సో యువర్ షార్ట్‌కట్ నేమ్ ఈజ్ 'బావ' వుత్సాహంగా చెప్పింది" సుమ.

"వండర్‌ఫుల్ థాట్. కంగ్రాచ్యులేషన్స్ యు వన్ ద ఐపోడ్" సుమకన్నా వుత్సాహంగా అన్నాడు వరుణ్. అందరూ నవ్వేశారు ఆనందంగా.

"జస్ట్ ఫైవ్ మినిట్స్. లంచ్ అవగానే యిస్తాను. కారులో వుంది" సిన్సియర్‌గా చెప్పాడు వరుణ్.

"థాంక్యూ బావగారూ! బట్ హిమక్క ఆల్రెడీ యిచ్చింది" జవాబిచ్చింది సుమ.

"దటీజ్ నన్ ఆఫ్ మై బిజినెస్. బెట్ ఈజె బెట్ ప్రామిస్ ఈజె ప్రామిస్" ఎమోషనల్ అయిపోయాడు.

"అయితే ఆన్ వన్ కండిషన్"

"ఓకె ఐ ఎగ్రీ"

"నా ఐపోడ్ రజనీ తీసుకోవాలి" రజనీని చూస్తూ అంది సుమ.

రజనీ వరుణ్‌ని చూసింది. వరుణ్ "ఓకె" అన్నట్లు తలూపాడు.

"కబుర్లాపి కాస్త తినండి" కొసరి కొసరి వడ్డిస్తూ హెచ్చరించింది అనురాధ. అందరి భోజనాలూ అయిపోయాయి.

ఎంప్లాయిస్‌తో బాటు గోపాలకృష్ణగారు ఫ్యాక్టరీ చూడడానికి వెళ్ళిపోయారు.

విజయలక్ష్మి, అనురాధలు ఓ గ్రూపైపోయారు.

అమ్మాయిలతో బాటు వరుణ్, బోస్‌లే మిగిలారు.

అందరినీ ఫ్యాక్టరీని ఆనుకున్న చెరువు దగ్గరకు తీసుకొచ్చింది సుమ.

చెరువంతా కలువ పూలతో, పెద్ద పెద్ద ఆకులతో చెప్పలేనంత అందంగా వుంది. ఎన్నిసార్లు తను ఈతకొట్టుకుంటూ కలువపూలు తెచ్చి హిమకిచ్చాడో బోసు గుర్తుచేసుకుంటుంటే -

ఎన్నిసార్లు అది చూసి నిర్మలవాళ్ళు వుడుక్కున్నారో జ్ఞప్తికి తెచ్చుకుంటూ చిన్నగా నవ్వుకుంటూ బోస్‌ను ఓరగా చూసింది.

బోస్ వరుణ్‌తో మాట్లాడుతున్నా చూపులు మాత్రం తననుంచి మరలించలేకపోవడం హిమకు వింతగానూ, విచిత్రంగానూ అనిపించింది.

రెస్టారెంట్‌లో బోసు చెప్పిన మాటలు గుర్తొచ్చి గుండెల్లో ఏదో గుచ్చుకుంటున్న భావం బలంగా తాకింది.

రజనీ ఫ్రెండ్స్‌తోబాటు లక్ష్మి కూడా థ్రిల్లైపోయింది.

"నేను కూడా వరుణ్ బాబుతో వచ్చేస్తా" అనేసింది.

"అయితే విష్ణుబాబును వదిలేస్తావా?" అని సుమంటే

"ఆయనెవరమ్మా?" అమాయకంగా అడిగింది.

"ఏయ్ పిచ్చీ మీ ఆయన్నే మర్చిపోయావా?" అంది సుమ.

"ఆయనపేరు అప్పారావు కదమ్మా?" అమాయకంగా అడిగితే

"అదేంటే మొన్న విజయవాడలో విష్ణు అని చెప్పావుగా. వాడినొదిలేశావా?" మళ్ళీ అడిగింది సుమ.

"పాపం యింకొద్దక్కా అసలే పిచ్చిది" రజని అడ్డం పడిపోయింది.

అందరూ వచ్చి ఓగిరాల వెళ్ళే రోడ్డుమీద వున్న వంతెన మీద కూర్చుండిపోయారు.

అప్పుడే పొలం నుంచి వస్తున్న భీముడు తాటాకులో కట్టుకొచ్చిన తంపటేసిన వేరుశెనగకాయలు, పెసరకాయలు తూమ్మీద పెట్టాడు. అందరూ ఒక్కసారిగా దాడి చేశారు.

బోసుబాబు కోర్టులో వున్న కేసుగురించి వివరిస్తుంటే వింటూనే సుమసింధు అందాలను ఆస్వాదించేస్తూ దొరక్కుండా దొంగ చూపులు చూస్తున్నాడు వరుణ్.

"ఏయ్ రజనీ! మనమంతా కాలవలో ఈతలు కొడితే?" సజెస్ట్ చేసింది సుమ.

"నో" అనేశారంతా ఒక్కసారే. వచ్చేముందు గంటలకొద్దీ చేసుకున్న అలంకరణ గుర్తొచ్చి.

అర్థం చేసుకుంది సుమ. "అయితే బెటర్ లక్ నెక్స్ట్ టైం" కాంప్రమైజ్ అయిపోయింది.

సాయంత్రం నాలుగు గంటలకు గోపాలకృష్ణ బయలుదేరిపోయారు.

ఊరి ప్రజలందరూ ఆనందంగా వీడ్కోలు చెప్తుంటే మరో వారం రోజుల్లో మళ్ళీ వస్తానని చెప్పారు.

"సీ యూ బావా" అన్న సుమ మాటలే పదే పదే గుర్తుచేసుకుంటూ అన్యమనస్కంగానే అందరికీ వీడ్కోలు చెబుతూ "ఐ విల్ బి బ్యాక్ విత్ యిన్ ఎ వీక్" అంటూ బోసుబాబుతో చాలా గట్టిగా చెప్పాడు.

హిమకు అర్థమైపోయింది. అతని మనసేమిటో. అదే గనక జరిగితే సుమతోబాటు వూరి ప్రజలు కూడా అదృష్టవంతులే మనసులో అనుకుంటూ స్వామితాత దగ్గరకు వచ్చి "తాతయ్యా యిదంతా మీ కృషే" అభినందిస్తుంటే "నాదేముంది తల్లీ వూరు చేసుకున్న పుణ్యం లాయర్ బాబు సాయం" అంటుంటే

"అయితే మీక్కూడా అభినందనలు" చిరునవ్వుతో సత్కరించింది బోసుబాబును.

"తల్లీ యిప్పుడిక్కడ నీతోబాటు గోపీనాథ్ బాబు వుండి వుంటే ఎంతో బాగుండేది."

స్వామి తాత మాటలకు గుండె లయ తప్పింది.

అప్పటిదాకా అనుభవించిన సంతోషమంతా ఆవిరైపోయినట్లు స్థాణువైపోయింది.

ఇంటికి ఆనుకుని వున్న పొలాల్లో హిమ తాతయ్య సమాధి. అందమైన గ్రానైటు చప్టా. ఎండ పడకుండా అందంగా నిర్మించిన మండపం ఆర్చిలు దిద్దిన కట్టడంలా వుంది ఆ సమాధి.

ఆ సమాధిని ఆనుకునే నిండుగా ప్రవహించే పంట కాలువ.

ఆ సమాధి ఆవరణలోనే కూర్చుని వున్నారు హిమ, సుమలు.

హిమ పూలమాల అల్లుతుంటే సుమ ఐపోడ్‌లో పాటలు వింటూ చాలా ఆనందంగా వుంది.

ఒక్కసారిగా చుట్టూ చూసింది హిమ. అందమైన ప్రకృతి, ఆహ్లాదాన్ని పంచే వాతావరణం దూరంగా. తలలూపుకుంటూ గట్టుమీద పచ్చగడ్డి మేస్తున్న పశువులు. ఆడుకుంటూ, పాడుకుంటూ అల్లరి చేస్తున్న బుడ్డోళ్ళు.

"నా జన్మభూమి ఎంత అందమైన దేశమూ" అప్రయత్నంగా ఆ పాట గుర్తొచ్చింది హిమకు.

హఠాత్తుగా ఇయర్ ఫోన్స్ తీసేసి "అక్కా! నాతో షేర్ చేసుకుంటానని మాటిచ్చావు ఇంకెంత కాలం ఈ సస్పెన్స్? అమ్మయితే నువ్వు నోరిప్పే వారంలోపే హార్ట్ ఎటాక్ తెచ్చుకునేలా వుంది. డాడీ ఏదో మేనేజ్ చేస్తున్నారు" అడిగింది సుమ.

హిమ బరువుగా నిట్టూర్చి "యస్ యు ఆర్ కరెక్ట్ ఇవ్వాళ కాకపోతే రేపయినా తప్పదు నా బెంగంతా అమ్మ గురించీ, గోపీ అమ్మా నాన్నల గురించే"

కళ్ళు విప్పార్చుకుని అక్కని చూసింది సుమ.

హిమ కళ్ళల్లో దైన్యం. ముఖంలో విషాదం. ఒక్కసారిగా స్టన్నయిపోయింది.

బోసుతో పెళ్ళి తప్పిపోయిననాడు కూడా యింత బేలగా లేదు తన అక్క. మరి యిదేంటి? మతి పోగొట్టుకుంది సుమ.

అంతలోనే ఏదో గుర్తొచ్చినట్లు "అక్కా! యివాళ బావ పేరెంట్స్ అదే అత్తయ్యా మామయ్యలు వస్తున్నారట కోడల్ని వీక్షించాలని" విషయం చెప్పింది సుమ.

"వస్తే రానీయ్" చూస్తారు, వెళతారు.

"అంత ఈజీగా తీసెయ్యకు మీ అత్తగారు నెక్స్ట్ సూర్యకాంతం. ఎంత చంపుకు తింటుందో ఏమో?"

"అమ్మ అడిగితేనే అంజాన్ కొట్టా అత్తగారొక లెక్కా?" చెప్పింది హిమ.

"అదంతా నాకెందుకు గానీ ఈ సస్పెన్స్‌ని తట్టుకోలేకపోతున్నా. హార్ట్ ఎటాక్ తెప్పించకు ప్లీజక్కా!"

చుబుకం పట్టుకుని బ్రతిమిలాడుతున్న చెల్లిని దగ్గరగా తీసుకుని ముద్దుపెట్టుకుంది.

"రహస్యాలంటూ నాకేమీలేవు. మీ అందరి ప్రశ్న అమెరికా వెళ్ళిన అమ్మాయి రెండేళ్ళ తర్వాత ఒంటరిగా ఎందుకొచ్చింది? ఇదేగా!
"

"ఔననుకో మరి బావ ఏమయ్యారు? ఇది కూడా ప్రశ్నేకదక్కా?"

"చెప్తాను. అంతా అందరికీ చెప్తాను. దానికంటే ముందు ఫ్యాక్టరీ విషయం ముఖ్యం. దీని మీద ఎందరి జీవితాలో ఆధారపడున్నాయి. స్వామి తాతను, అమ్మమ్మను, మనూరి వాళ్ళందరినీ చూడగానే నా గుండె ద్రవించుకుపోయింది. పోల్చుకుని చూసుకుంటే నా సమస్య మనూరి సమస్య ముందు చాలా చిన్నదనిపించింది. అందుకే రాగానే గోపాలకృష్ణ అంకుల్‌ని కలిశాను. ఊరి అదృష్టం ఆయన కూడా పాజిటివ్‌గా స్పందించారు. బోసుబాబు కూడా చాలా కృషి చేస్తున్నాడు. కోర్టు తీర్పు అనుకూలంగా వస్తే కార్మికుల ఎరియర్స్, గ్రాట్యుటీ యిస్తారు. కానీ ఫ్యాక్టరీ యిలాగే వుండిపోతుంది. ఇప్పుడు నా సమస్య బయటపడితే అందరూ షాక్ అయిపోతారు. సానుభూతి చూపిస్తారు. నాకు అది యిష్టంలేదు. తోటివారికోసం తాతయ్యలాంటి సామాన్య వ్యక్తి తన ఆస్థి మొత్తం ధారపోశాడు. నేను పుట్టిన గడ్డ. నన్ను పెంచిన వూరు దీనికోసం నేనేం చేయలేనా? చెయ్యాలి చేస్తాను. చేసి చూపిస్తాను. ఎంతో కోల్పోయానన్న బాధతో, వ్యథతో మనూళ్ళో అడుగుపెట్టాను కానీ యిప్పుడా ఫీలింగ్ లేదు. ఏదైనా చేసి చూపించాలన్న పట్టుదల అదే నా గోల్. రేపో మాపో వరుణ్ వచ్చేస్తాడు. రాగానే తనతో నా ప్లాన్ చెప్తాను. మనూరికి మంచి రోజులు వస్తే మనూరి ప్రజల ముఖాల్లో ఆనంద ఛాయలు తొంగిచూస్తే నా జీవితం ధన్యమైనట్లే"

ఆవేశంలో ఆగకుండా చెప్పుకుపోతున్న అక్కను చూస్తుంటే ఏదో తెలియని ఆనందం అనుభూతి సుమను ఆవరించేసింది.

"అక్కా! యు ఆర్ గ్రేటక్కా" అంటూనే ముద్దుల వర్షం కురిపించేసింది.

పొలం గట్టుమీద నుండి పరిగెత్తుకొస్తున్న సీతను చూస్తూనే సర్దుకున్నారిద్దరూ.

"అమ్మాయిగారండీ.. అమ్మగారు రమ్మంటున్నారు"

ఆ మాటలతోనే అర్థమైపోయింది ఇద్దరికీ అతిథులొచ్చారని.

హిమ, సుమలు ఇంట్లోకి అడుగుపెట్టే సమయానికి వియ్యంకులు వియ్యపురాళ్ళు రిలాక్స్‌డ్‌గా కూర్చుని వున్నారు.

హిమ ఇద్దరికీ నమస్కారం పెట్టి ఎదురు సోఫాలో కూర్చుండిపోయింది.

సుమ అమ్మా, నాన్నల ప్రక్కన సెటిలైపోయింది.

"ఏమ్మా నువ్వొస్తావని ఎదురు చూశాం రాలేదేం?" అడిగింది హిమ అత్తగారు.

మాటల్లో తప్పు చేతుల్లో కనిపించని సౌమ్యత ఆమెది. అందుకే అనురాధకు అంత దగ్గరైపోయింది. అట్టహాసాలు ఆడంబరాలు ఇద్దరినీ విడదీయరానంత దగ్గర చేశాయి.

అసలు వీళ్ళిద్దరి పథకం స్వార్థాలే గోపీ - హిమల పెళ్ళికి మూలాలయ్యాయి.

బోసుబాబు హిమల ప్రేమ బయటపడినప్పుడు బందరు కాలువలో దూకేసి భర్తనే బ్లాక్ మెయిల్ చేసిన ఘనాపాటి అనూరాధైతే, ఈ వివాహం చేసుకోకపోతే విషం తాగి చస్తానని కొడుకునే కట్టిపారేసిన కరోడా హిమ అత్తగారు కమలమ్మ.

కట్నం వద్దన్న కొడుకుని కాల్చి వాతలు పెడతా ఖబడ్దార్ అంటూ గుప్పెట్లో పెట్టుకున్న కడుపు తీపున్న కన్నతల్లి కమలమ్మైతే, కులంగాని కుంకతో ప్రేమ పెళ్ళంటే నీ చెల్లిని చంపి మేమిద్దరం ఆత్మహత్య చేసుకుంటామని చెలరేగిపోయి బోసుబాబు తల్లిదండ్రుల్ని భయభ్రాంతులకు గురిచేసిన 'గుండా టైపు' హిమ తల్లి అనురాధ.

"డాడీ ఫ్రెండ్ గోపాలకృష్ణగారొస్తే" హిమ మాటలను కట్ చేస్తూ "ఆ.. ఆడో వెధవ రెడ్లకు భయపడి ఎడ్డోడ్లా పారిపోయాడు. ఆడినెందుకు రానిచ్చారు మళ్ళీ?" ఆపుకోలేని అహంకారం ధ్వనించింది కమలమ్మ మాటల్లో.

"ఆ మళ్ళీ ఫ్యాక్టరీ ఓపెన్ చేస్తానని కూతలు కూశాడు అదీ చూద్దాం" హేళనగా అంది అనురాధ.

"అది సరే నువ్వొచ్చావ్ మరి మా గాడిద ఎక్కడ? ఫోన్ చెయ్యడు, ఫోన్ తియ్యడు అంత బిజీగా చచ్చాడా?"

ఒక్కసారిగా తుళ్ళిపడింది హిమ. అత్తగారి మాటల వేడికి వాడికి అప్రయత్నంగా కళ్ళవెంట నీళ్ళు సుడులు తిరిగాయి. మూడీగా మారిపోయింది.

"ఏంటి హిమబిందూ.. ఎవరో చచ్చిపోయినట్లు ఆ కన్నీళ్ళేంటి? నిన్ను కాదు ఆ వెధవను అనాలి."

"ప్లీజ్ ఆంటీ అలా తిట్టకండి. బావనంటే అక్క బాధపడదా?" సుమ అడిగింది.

"ఆ వీళ్ళ బాధే చూశావ్. మేమెంత బాధపడి చస్తున్నామో ఎవడికి అర్థమౌతుంది? పెళ్ళి చేసుకునెళ్ళి రెండేళ్ళయింది. ఆర్నెల్లకోసారి ఫోన్ తప్పు - అది కూడా మొక్కుబడిగా ఈ మధ్య అదికూడా లేదు. మా బాధలు మేమెవరితో చెప్పుకోవాలి?" ఈసడింపుగా అంది కమలమ్మ.

"సరే అమ్మాయి వచ్చిందిగా తనే చెప్తుంది" సర్దబోయారు కమలమ్మ భర్త రంగయ్యగారు.

"కొడుకు గురించి కోడల్ని అడిగి తెలుసుకోవాల్సిన ఖర్మ పట్టింది. ఇదంతా నా ప్రారబ్ధం" నుదురు కొట్టుకుంది. కూతురు యిప్పుడైనా నోరిప్పితే అసలు విషయం తెలుస్తుందనుకుంటూ ఆత్రంగా వుంది అనురాధ.

"తను ఫోన్ చేస్తానన్నారు.. చాలా బిజీగా.."

హిమ మాటలు పూర్తవ్వకుండానే "ఏంటమ్మా బిజీ? ప్రతిరోజు మేమిక్కడ చచ్చిపోతున్నాం. ఇంకా చంపాలనా?"

"అత్తయ్యా తను ఫోన్ చేస్తారని చెప్పాగా? నాకూ యింతవరకు ఫోన్ చేయలేదు."

"నువ్వెట్టా చస్తే నాకేంటి? వాడ్ని రానీయ్ చెప్తాను. అమెరికా అని ఎగిరిపోతున్నాడు"

సీత అందరికీ కూల్ డ్రింక్స్ తేవడంతో ఆగిపోయింది కమలమ్మ.

అనురాధ కూతురి సమాధానానికి హతాసురాలైపోయింది.

హిమ మౌనంగా లేచెళ్ళి చేతిలో గిఫ్ట్ బేగ్‌లతో వచ్చి "అత్తయ్యా తను పంపించారు" అంటూ అందించబోతుంటే "ఈ బోడి గిఫ్టులు ఎవడికి కావాలి? వాడికే తీసుకెళ్ళి యిచ్చేసెయ్" తిరస్కారంగా తోసేసింది.

"అదేంటి అబ్బాయిమీద కోపం అమ్మాయి మీద చూపిస్తున్నావ్ ఇటివ్వు తల్లీ" రంగయ్యగారు అందుకున్నారు.

మూతి తిప్పుకుంది కమలమ్మ.

"గోపీ ఎప్పుడొస్తానన్నాడమ్మా? నువ్వెన్నిరోజులుంటావ్?" మామగారు అడిగిన ప్రశ్నకు

"సెలవు దొరకడం కష్టంగా వుంది మామయ్యా! ఇప్పుడు ఐటీ వుద్యోగాలు ఎలా వున్నాయో మీరూ చూస్తున్నారుగా!? సెలవు దొరకగానే వస్తానన్నారు. నేనూ తనతోబాటే వెళ్ళిపోతాను" చాలా లో వాయిస్‌తో సమాధానం చెప్పింది.

"సరే వెంకటరత్నంగారూ.. మళ్ళీ కలుస్తాం" లేచి నిలబడ్డాడు రంగయ్యగారు.

ఎంతో అయిష్టంగా లేచి నిల్చుంది కమలమ్మ.

హిమ మౌనంగా వచ్చి ఇద్దరి పాదాలకూ నమస్కరించింది.

రాత్రి పన్నెండు గంటలు దాటిపోయింది. ఆలోచనల మధ్య అశాంతిగా ఫీలవుతూ నిద్రకోసం ప్రయత్నిస్తున్న బోసుబాబు రింగ్ అవుతున్న సెల్‌ను చూస్తూనే షాకైపోయాడు. కారణం ఆ సెల్‌ఫోన్ హిమ ఇచ్చిన ఫోన్ కావడం.

గుండె లయ తప్పుతుంటే తీసుకుని చూశాడు. హిమ ఫీడ్ చేసినట్లుంది. హిమ ఇమేజ్ ప్రత్యక్షమవుతుంటే పన్నీటితో స్నానం చేసినంతగా పులకరించిపోయాడు.

హిమా ఒక్కసారిగా గుండె గొంతులోకి వచ్చేసిన అనుభూతి. కాళ్ళు భూమ్మీద నిలబడని ఫీలింగ్.

"బాబూ నేను హిమని"

ఒక్కసారిగా వేయి కోయిలల గొంతు వసంతగానంలా వినిపించినట్లు పులకరించిపోయాడు. మైండ్ బ్లాంక్ అయిపోయింది. అరచేతిలోని చెమట స్పష్టంగా తెలుస్తోంది. ఊపిరి ఆగిపోతుందేమోనన్న స్థితి. "ఎలా వున్నావు హిమా?"

"బాగున్నాను బాబూ!"

పూర్వాశ్రమంలో గంటలతరబడి స్వీట్ నథింగ్స్ మాట్లాడుకున్న యిద్దరూ మౌనానికి అప్పుడే మాటలొచ్చినట్లు ఇద్దరిలోనూ వింత అనుభూతి.

"రేపు మనం కలవాలి. చాలా విషయాలు మాట్లాడాలి."

"ఎనీ టైం అయాం ఫ్రీ"

"ఫ్యాక్టరీ మేడగది వరుణ్ కోసం రెనొవేట్ చేయిస్తున్నారు డాడీ. ఇంటీరియర్స్ నన్ను చూడమన్నారు. ఉదయం పదిగంటలకు నేనూ సుమా అక్కడ వుంటాం."

"నేనూ అక్కడ వుంటా"

"గుడ్‌నైట్" హిమ వాయిస్.

హతాసుడై గుడ్‌నైట్ చెప్పేశాడు బోసుబాబు.

"రేపు పదిగంటలకు హిమతో డిష్కషన్స్"

పదేపదే ఆ ఆలోచనే ఆవిష్కారమవుతుంటే కదులుతున్న కనురెప్పల్ని కలపాలని విశ్వప్రయత్నం చేసినా ఆ రాత్రి అతనివల్ల కాలేదు.

ఫ్యాక్టరీలో కోలాహలం మొదలైంది. స్వామితాత కొడుకు 'సూర్యం' పాలెం వచ్చేశాడు. మెకానికల్ పనులన్నీ అతనే చూసుకుంటున్నాడు.

పాత వర్కర్లంతా దాదాపు జాయినైపోయారు.

స్వామితాత కుడి భుజంలాంటి వెంకన్న. వర్కర్ల రిక్రూట్‌మెంట్‌లో తలమునకలౌతున్నాడు.

బందరు కాలువలో తిరుగుతున్న రహదారి పడవల మూలంగా ఫ్యాక్టరీ ఓపెనింగ్ వార్త విజయవాడ నుండి బందరు వరకు 'టాంటాం' అయిపోయింది.

అప్పుడే తోట్లవల్లూరు మండపంలోని అన్ని గ్రామాల రైతులు రాకపోకలు సాగించేశారు.

ఇక ముందు తమ పొలాల్లో పనిచేసే రైతు కూలీలు లభ్యంకారని చాలామంది రైతులు బెంగపెట్టేసుకున్నారు.

ఉదయం పదిగంటలకు హిమ సుమలు వచ్చేసారు.

అప్పటికే వుయ్యూరు నుండి ఇంటీరియర్ కాంట్రాక్టర్ వచ్చేశాడు.

పెయింటింగ్ వర్క్సతోబాటు ఫాల్స్ సీలింగ్ వర్క్స కూడా స్పీడప్ చేయించేశాడు.

హిమ, సుమలు ఇద్దరూ పాలమీగడలాంటి చుడిదారుల్లో రాజహంసల్లా దర్శనమిచ్చారు.

పదినిమిషాల తర్వాత లాయర్ బోసుబాబు కూడా వచ్చేశాడు.

"ప్రజలకోసం పాటుపడిన బోసుబాబుకు స్వాగతం" రాగయుక్తంగా పాట స్టార్ట్ చేసింది సుమ.

చిన్నగా నవ్వేసి హిమ ముందున్న ఖాళీ చెయిర్‌లో సెటిలైపోయాడు బాబు.

"కష్టపడి పాట పాడితే కనీసం థాంక్స్ కూడా చెప్పరా లాయర్‌గారు?" నిలదీసింది సుమ.

"నోటితో కాదు డైరీ మిల్క్ చాక్లెట్లతో చెబుదామని" అంటూనే చాక్లెట్ ప్యాక్ తీసిచ్చాడు.

"భడవకు భయం భక్తులు పెరిగిపోయాయ్" అమ్మమ్మను ఇమిటేట్ చేస్తూ ప్యాకెట్ ఓపెన్ చేసి హిమకొకటి, బోసుబాబుకొకటి యిచ్చింది.

"బాబూ! కోర్టు కేసుగురించీ, మీరు పెట్టిన క్లైమ్స్ గురించి నాకు ఇన్‌ఫర్మేషన్ కావాలి. ఇఫ్ యు డోంట్ మైండ్"

"ఏం కావాలో అడుగు ఇందులో సీక్రెట్ ఏముంది? ముందే చెబితే ఫైల్స్ కూడా తెచ్చేవాడిని" చాలా హ్యాపీగా, సిన్సియర్‌గా చెప్పాడు.

"మరైతే మనమెందుకిక్కడ? అమ్మమ్మ దగ్గరకే నిష్క్రమింతును" అంటూనే సుమ వెళ్ళిపోయింది.

"అసలు అంకుల్ బాపిరెడ్డిల మధ్య డిస్ప్యూట్ ఏమిటి? అంకుల్ అసలు కోర్టుకు ఎందుకు వెళ్ళారు? స్వామితాతకు కోర్టుకు సంబంధం ఏమిటి? చాక్లెట్ రేపర్ ఓపెన్ చేస్తూ " అడిగింది హిమ.

"ఐదేళ్ళ క్రితం వరకు గోపాల్‌క్రిష్ణ అంకుల్ ఫ్యాక్టరీయే ఈ ఏరియాలో నెంబర్ వన్. బాయిల్డ్‌రైస్ ఫ్యాక్టరీ కాబట్టి కేరళతో వ్యాపారం ముమ్మరంగా చేసేవారు. ఇక్కడ రోడ్ ట్రాన్స్‌పోర్టుతోబాటు కెనాల్ ట్రాన్స్‌పోర్టు వుండడం అంకుల్‌కి ప్లెస్ అయింది. రైతులకు గిట్టుబాటు ధరను యిస్తూనే బోనస్‌గా ఎక్స్‌ట్రా పే చేయడంతో రైతులంతా ఈ ఫ్యాక్టరీకే ధాన్యాలను తోలేవారు. ఓగిరాల బాపిరెడ్డి మిల్లుకూడా పెద్దదే. అయితే ధాన్యం సప్లైలేక మూతబడిపోయే స్థితికొచ్చింది. అప్పుడు చీప్‌ట్రిక్స్ ప్రయోగించి మెయిన్ వర్కర్లందరినీ ప్రలోభపెట్టి తనవైపు తిప్పుకున్నాడు. చివరకు స్వామితాత కొడుకు సూర్యాన్నికూడా.

ఆ సంవత్సరం విపరీతమైన ఆర్డర్లు వచ్చినా రైస్ సప్లై చేయలేకపోయారు అంకుల్. ఒక్కసారిగా ఆర్డర్లన్నీ కాన్సిల్ అయిపోయాయి. అదే సిట్యువేషన్‌ని తనకు లాభసాటిగా మార్చుకున్నాడు బాపిరెడ్డి.

నెక్స్ట్ యియర్ రైతులకు అడ్వాన్సులిచ్చి ధాన్యం సేకరించినా మార్కెట్ ఒడిదుడుకుల మూలంగా విపరీతంగా నష్టపోయారు. మిల్లు మూసేసి విజయవాడ వెళ్ళిపోయారు. వర్కర్లంతా వీధిన పడ్డారు. అలాగే రెండేళ్ళు గడిచాయి.

స్వామితాత విజయవాడ వెళ్ళి గోపాలకృష్ణగారిని కన్విన్స్ చేయాలని చూసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు.

కనీసం వర్కర్ల గ్రాట్యుటీ ఎరియర్స్ అడిగినా ఆయన మాట్లాడలేదు. ఆఖరి ప్రయత్నంగా కోర్టుతలుపులు తట్టాడు స్వామితాత" బోసుబాబు ఆగాడు.

"అయితే చాలా పెద్దకథే! స్వామితాత ఎంతకు క్లైమ్ పెట్టారు?" అడిగింది హిమ.

"ఎప్రాక్స్‌మేట్లీ రెండు కోట్లుంటుంది" ఆలోచిస్తూ చెప్పాడు బోసుబాబు.

"అమ్మా" తమరొకసారి వచ్చి చూస్తే ఫైనల్ ఫినిషింగ్ పూర్తిచేయించేస్తా రేపు కర్టెన్లుతోబాటు ఫర్నీచర్ కూడా వచ్చేస్తుంది. ఏ.సిలన్నీ ఫిట్ చేశారు.

కాంట్రాక్టర్ మాటలకు కళ్ళెత్తి చూసి నెమ్మదిగా కదిలింది హిమ.

ఆమె మనసులో అప్పటికే ఓ ప్లాను రూపు దిద్దుకుంటోంది.

బోసుబాబుతో కలిసి ఆ యింట్లో అడుగుపెడుతుంటే ఓ విచిత్రమైన ఫీలింగ్. అప్రయత్నంగా పెదాలమీద అలవోకగా తొంగిచూసింది చిరునవ్వు.

వరుణ్ రాగానే తన ప్లాను వివరించాలనే నిర్ణయానికొచ్చేసింది.

అన్ని రూములూ కలియతిరిగింది అందంగా తీర్చిదిద్దారు.

ఆ వూళ్ళో అంతటి స్థాయి మోడ్రన్ ఫెసిలిటీస్? 'వావ్' అనుకుంది.

అంతలోనే రమ్యను వెంటబెట్టుకుని సుమ వచ్చేసింది.

లోపలి యింటీరియర్ చూసి "బావకు తగ్గట్టే వుంది సినిమా సెట్టింగ్‌లా" కామెంట్ చేసింది.

"అమెరికా అబ్బాయికదా! ఈ మాత్రం వుండాలి మరి" హిమ సమర్థించింది.

"మనిషికి డబ్బుకాదక్కా దిల్లుండాలి మనూర్లోంచి అమెరికా వెళ్ళిన అబ్బాయిలు ఎందరు లేరు? ఎవర్ని చూసినా మని మనీ మోర్ మనీ అన్న యావే తప్ప మరో ధ్యాసేలేదు. అందరూ వేస్ట్ ఫెలోసే నాదీ గ్యారంటీ" స్టేట్‌మెంట్ యిచ్చేసింది సుమ.

"అమ్మా! వొణ్ణాలకొస్తారా? ఇక్కడికే తేవాలా?" అని అమ్మగారు అడిగిరమ్మన్నారు సీత చలాకీగా వచ్చేసింది.

అయితే అమ్మకు యిక్కడ బోసున్నాడన్న విషయం తెలీదనుకుంటాను అని మనసులో అనుకుంటూ "నువ్వెళ్ళి తీసుకురా అని చెప్పి" సుమను దగ్గరగా పిల్చి, "నువ్వుకూడా వెళ్ళిరా ఇది అక్కడ బోసుబాబు గురించి వాగకుండా చూసుకో" గుసగుసలాడింది హిమ.

"అక్కా" నాకు తెలుసు. మరింత గుసగుసగా చెప్పి రమ్యను వెంటబెట్టుకుని సీతతో వెళ్ళిపోయింది సుమ.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments